క్లుప్తంగా

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

విజయపురం: మండలంలోని ఎల్లసముద్రం ప్రాథమిక పాఠశాలలో శనివారం వార్షికోత్సవం నిర్వహించారు. 5వ నుంచి 6వ తరగతికి వెళ్లే పిల్లలను విద్యా సామగ్రి అందించారు. అలాగే పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రభుత్వం పాఠశాలలో మంచి విద్యతోపాటు విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రి అందజేస్తారని, ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్చాలని హెచ్ఎం వంశీకృష్ణ పిలుపునిచ్చారు.

పుత్తూరు రచయితకు విశిష్ట ఆహ్వానం


ఎ.రుద్రమోహన్

పుత్తూరు: ఏలూరులో మే 10వ తేదీ నుంచి రెండు రోజులపాటు నిర్వహించనున్న ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలకు పుత్తూరుకు చెందిన రచయిత అత్తూరు రుద్రమోహన్‌కు ఆహ్వానం అందింది. సాహితీ సంబరాల్లో భాగంగా నిర్వాహకులు 'అమ్మ'పై కవితా సంక్రమణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో రుద్రమోహన్ అమ్మపై చేసిన వచన కవిత ఎంపికైంది. దీంతో ఆహ్వానం అందుకొన్న రుద్రమోహన్ ప్రపంచ తెలుగు సాహితీ సంబరాల్లో తను రచించిన అమ్మపై వచన కవితను ఆలపించనున్నారు. రుద్రమోహన్ వెన్నల్ని మింగిన చీకటి, దిక్కెవ్వరు, కోరికలే గుర్రాలయితే, ఇదెక్కడి న్యాయం, రక్షకులే రాక్షసులైతే, మానవత్వం మేనుతడితే, భాగ్యలక్ష్మీ కోరల్లో అభాగ్యులు తదితర కథా రచనలతోపాటు సామాజిక ఇతివృత్తంపై పలు కవితలు రాశారు.

గాయపడిన వ్యక్తి పరిస్థితి విషమం

పుత్తూరు: మండల పరిధిలోని గొల్లపల్లి క్రాస్ వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వ్యక్తి పరిస్థితి విషమంగా ఉంది. ఏఎస్ఐ పొన్నుస్వామి కథనం మేరకు పుత్తూరు మండలం కసింకుప్పం గ్రామానికి చెందిన వి.మునిరామయ్య(52) గొల్లపల్లి క్రాస్ వద్ద ఉన్న పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడు. యథావిధిగా శనివారం సాయంత్రం విధులు ముగించుకొని స్కూటర్‌పై రోడ్డు దాటుతుండగా పుత్తూరు నుంచి తిరుపతి వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మునిరామయ్యను పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స చేసినా పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

కార్వేటినగరం: పరిసరాలు శుభ్రంగా ఉంటే వ్యాధులు దూరమవుతాయని కత్తెరపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ భువనేశ్వరి అన్నారు. శనివారం ఆరోగ్యకేంద్రం ఆవరణలో సిబ్బంది స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పిచ్చి మొక్కలు, వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వారానికి ఒకరోజు డ్రైడే పాటించినప్పుడే వ్యాధులు ప్రబలకుండా ఉంటాయన్నారు. ఇళ్ల ముందు ఉండే మురుగునీటి కాల్వల్లో వ్యర్థాలను వేయకుండా చూడాలన్నారు. అనంతరం సిబ్బందితో మానహారం ఏర్పాటు చేసి గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

భారీగా సారా ఊట ధ్వంసం


సారా తయారీ పరికరాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

పాలసముద్రం: మండలంలో సారా స్థావరాలపై డీఎస్పీ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో కార్వేటినగరం ఎక్సైజ్ సీఐ శిరీషాదేవి, పాలసముద్రం ఎస్ఐ చిన్నరెడ్డెప్పతో కలసి శనివారం సారాబట్టీలపై దాడులు చేశారు. నరసింహాపురం సమీపంలోని కొండల్లో, వాగు, వంకల్లో సారా తయారీకి వేసే సుమారు 1800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. అలాగే సారా తయారీ పరికరాలను స్వాధీనం చేసుకుని, నిందితుడు రామ్మూర్తిపై ఎక్సైజ్ శాఖ అధికారులు కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ, స్థానిక స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

భానుడి భగభగలు



మేలో ఎండలు మెండు అంటూ చదువుకొన్న రోజులు పోయాయి. మార్చి నెల నుంచే తన ప్రతాపాన్ని చాటుతూ వచ్చిన సూర్యుడు ఏప్రిల్ నెలలోనే తన విశ్వరూపం చూపుతున్నాడు. దీంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మే నెల దేవుడెరుగు ఈ ఏప్రిల్ గడిచేదెట్లా అంటూ.. ఉదయం పదింటికే ఇంటి ముఖం పడుతున్నారు. మళ్లీ సాయంత్రం ఐదు దాటితేగానీ గడప దాటడం లేదు.

- జిల్లాలో 37 నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు
- ఉదయం పదింటికే ఇంటిదారి పడుతున్న జనం
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యాధికారులు


ఈత కొడుతున్న పిల్లలు

పుత్తూరు: రోజు రోజుకు పెరుగుతున్న ఎండ తీవ్రతకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఎండ వేడి ఎక్కువగా ఉంటున్న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్యలో పనిచేయడం, ప్రయాణాలు చేయడంతో వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వైద్యాధికారులు చెబుతున్నారు. ముఖ్యమైన పనులు ఉంటేనే ప్రజలు మధ్యాహ్నం వేళ బయటకు రావాలని, లేకుంటే ఇళ్లలోనే ఉండాలంటూ సూచనలు చేస్తున్నారు. బయటకు వచ్చే సమయంలో తలకు టోపీ, కళ్లద్దాలు ధరిస్తే మంచిదని చెబుతున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

ఎండ వేడికి సన్‌స్ట్రోక్‌లతో శరీరం అధిక ఉష్ణోగ్రతలకు గురైనప్పుడు నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఫలితంగా శరీర ఉష్ణోగ్రత ఒక్కసారిగా 43 డిగ్రీలకు చేరుకుంటే వడదెబ్బ తప్పదు. ముఖ్యంగా రెండేళ్లలోపు పిల్లలు, గర్భిణులు, వృద్ధులు, ఎండలో పనిచేసే కార్మికులు వడదెబ్బకు గురయ్యే అవకాశాలెక్కువ. ఇలా వడదెబ్బ తగిలిన వారిని వెంటనే దగ్గరలోని పీహెచ్‌సీలకు తరలించి చికిత్స అందించాలి. ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు ప్రభుత్వం పీహెచ్‌సీల ద్వారా ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తోంది. ఉపాధి కూలీలు ఎండలో పని చేయడం ద్వారా డీహైడ్రేషన్‌కు గురవుతూ ఉంటారు. ఈ పరిస్థితిని అధిగమించడానికి ఉపాధి కూలీలకు ఆశా వర్కర్లతో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేస్తున్నారు. కూలీలు నిర్ణీత వేళల్లో మాత్రమే పనులు చేసేలా అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలి. జనం రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సైతం ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయడానికి అధికారులు తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వడదెబ్బ లక్షణాలు

- చెమట పట్టక పోవడం
- శరీరం ఉష్ణోగ్రత పెరగడం
- వణుకు, ఫిట్స్ రావడం
- అపస్మారక స్థితికి వెళ్లడం

ఎండకు గొడుగే రక్ష



వేసవి తాపానికి చిట్కాలు

- రోజుకు రెండుసార్లు చన్నీళ్లతో స్నానం చేయాలి
- కాటన్ వస్త్రాలనే ధరించాలి
- నూనె పదార్థాలను తినడం మానాలి
- కాఫీ, టీలను తగ్గించి మజ్జిగ తాగాలి
- ఆకుకూరలు, సలాడ్స్ ఎక్కువగా తినాలి
- ఓఆర్ఎస్, ఎలక్ట్రాల్ పొడర్లను నీటిలో కలుపుకొని తాగాలి
- శరీరానికి విశ్రాంతి అవసరం. యోగా, ధ్యానం చేయాలి
- పడుకునే ముందు అరచేతులు, పాదాలకు యాంటీ రెస్పిరెంట్స్ రాసుకోవాలి

ప్రథమ చికిత్స అత్యవసరం



వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే నీడ ప్రదేశానికి చేర్చాలి. చల్లని నీటిలో ముంచిన తడిగుడ్డతో శరీరమంతా తుడవాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చే వరకూ ఇలా చేస్తూ ఉండాలి. ఫ్యాన్ గాలి లేదా చల్లని గాలి తగిలేలా చూడాలి. ఉప్పు కలిపిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్ ద్రావణం లేక ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించాలి. స్పృహ లేని వ్యక్తికి నీరు తాగించకూడదు. వీలైనంత త్వరగా దగ్గరలో ఉన్న పీహెచ్‌సీ కేంద్రానికి తరలించాలి.

–డాక్టర్ ఎస్.ఎం.ప్రవీణ్‌కుమార్, వైద్యాధికారి, గొల్లపల్లి పీహెచ్‌సీ, పుత్తూరు మండలం

మనస్పర్థలు పక్కన పెట్టండి


నాయకులతో మాజీ మంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: మనస్పర్థలు పక్కన పెట్టి పార్టీ బలోపేతానికి కలిసి పనిచేయాలని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి సూచించారు. శనివారం మండలంలోని తిరుమయ్యపల్లె పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయన్ను కలిశారు. ఈసందర్భంగా ఆయన వారిని ఉద్దేశించి పలు సూచనలు ఇచ్చారు. గ్రూపు రాజకీయాలు వద్దని.. అందరూ ఒకేతాటిపై నిలబడి పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నరసింహారెడ్డి, వెంకటరెడ్డి, రాము, ధర్మయ్య, అనిల్, రమణ, శివారెడ్డి పాల్గొన్నారు.

ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ విజయులురెడ్డి

వెదురుకుప్పం: ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయులురెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతోనే విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధించగలుగుతారని చెప్పారు. అనంతరం కళాశాలలో నిర్వహించిన సాహిత్య, సాంస్కృతిక, క్రీడల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అన్నపూర్ణశారద, రిటైర్డ్ ఏఈ టీటీడీ మునికృష్ణయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

నగరి: జాతీయ లోక్‌అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి విష్ణువర్మ పిలుపునిచ్చారు. శనివారం జాతీయ లోక్‌అదాలత్ విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై పోలీస్, ఎక్సైజ్ అధికారులు, న్యాయవాదులతో నగరి కోర్టు భవనంలో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని కక్షిదారులతోపాటు, వాది, ప్రతివాదులు తమ కేసులను రాజీ పరచుకోవాలని కోరారు. వచ్చే నెల 10న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నామన్నారు. ప్రజలకు ఇదొక సువర్ణావకాశమన్నారు. కోర్టుల్లో ఎప్పటి నుంచో ఉన్న కేసులను రాజీ చేసుకుని.. కొత్త జీవితాన్ని ప్రసాదించేందుకు లోక్ అదాలత్ పనిచేస్తుందన్నారు. అధిక సంఖ్యలో క్రిమినల్, సివిల్, బ్యాంకులకు సంబంధించి కేసులను జాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సయ్యద్ అబ్దుల్ అజీజ్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డి, ఎస్ఐలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తొలగించాలి


స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్

నగరి: ఎలక్ట్రానిక్ వ్యర్థాలను దూరం చేద్దామని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎలక్ట్రానిక్ వ్యర్థాల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణ పరిధిలో ర్యాలీ నిర్వహించి టవర్‌క్లాక్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పర్యావరణానికి ముప్పుగా మారుతున్నాయన్నారు. ఎక్కువగా కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు ఉంటున్నాయన్నారు. ఆ పరికరాల్లో వినియోగించే చిప్‌లు, సెమీ కండక్టర్లు పర్యావరణానికి హాని చేస్తాయని నిపుణులు సూచిస్తున్నారన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఇంటి నుంచి వచ్చే చెత్తతో కలిపి ఇవ్వకూడదని, ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ కోసం పురపాలక సంఘ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లోనే అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈ రవీంద్రరెడ్డి, మేనేజర్ శేఖర్, రెవెన్యూ ఆఫీసర్ వెంకట రామయ్య, ఏఈలు నవీన్, హేమశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, సీడీపీఓ కృష్ణవేణి, సీఎంఎం ప్రశాంత్, పురపాలక సిబ్బంది, సచివాలయం సిబ్బంది, మెప్మా సీఓలు, ఆర్పీలు పాల్గొన్నారు.


కోర్టు ఆవరణలో శుభ్రం చేస్తున్న జడ్జి విష్ణువర్మ

కోర్టు ఆవరణలో శుభ్రత పనులు

స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కోర్టు ఆవరణలో ఉన్న చెత్తకుప్పలను జూనియర్ సివిల్ జడ్జి విష్ణువర్మ శుభ్రపరిచారు. సిబ్బందితో కలిసి ఎండుటాకులను, చెత్తను ఊడ్చి శుభ్రం చేశారు.

గర్భిణులకు పోషకాహారం తప్పనిసరి


పోషకాహార ప్రదర్శన చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

వెదురుకుప్పం: అంగన్‌వాడీ పిల్లలు, గర్భిణులు, బాలింతలు పోషకాహారం తప్పని సరిగా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి అన్నారు. శనివారం మండలంలోని చవటగుంట అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార పదార్థాల ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బరువు తక్కువ ఉన్న పిల్లలకు అందించాల్సిన ఆహారం గురించి తెలుసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు, రెండేళ్లలోపు పిల్లలు తీసుకోవాల్సిన సంరక్షణపై అవగాహన కల్పించారు. తక్కువ ధరలకు దొరికే ఆకుకూరలు, చిరుధాన్యాలు, కూరగాయల్లో పోషకాలు పుష్కలంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శకుంతల దేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ-వేస్ట్ కేంద్రం ప్రారంభం


ఎలక్ట్రికల్ వేస్ట్‌ను సేకరిస్తున్న కమిషనర్

పుత్తూరు: స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపల్ అధికారులు ఈ–వేస్ట్ కలెక్షన్ సెంటర్‌ను ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ మంజునాథగౌడ్ మాట్లాడుతూ పట్టణంలోని షాపు యజమానులు తడి, పొడి, హానికర చెత్తలను వేర్వేరుగా మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని సూచించారు. అలాగే ఎలక్ట్రానిక్ వేస్ట్‌ని వేరుగా అందజేయాలని వాటిని మున్సిపల్ సిబ్బంది రీసైక్లింగ్ కేంద్రాల్లోకి తరలించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. పట్టణ ప్రజల చేత స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రియాంక, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

నగరి: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్ని ప్రమాదాల నివారణపై ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు అవగాహన కల్పించారు. శనివారం పాఠశాలలకు వెళ్లిన ఆయన అగ్నిప్రమాదాల నివారణ, మంటలను అదుపుచేసే ప్రక్రియలపైనా డెమో నిర్వహించారు. మంటలు ఎక్కువగా వచ్చినపుడు వాటిని ఎలా ఆర్పాలో ప్రత్యక్షంగా చేసి చూపారు. ఎత్తైన ప్రదేశాల్లో మంటలు ఉన్నా అక్కడకు నీటితో వాటిని ఆర్పడానికి ఎలాంటి ప్రక్రియలు చేస్తారో వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ప్రతాప్, ప్రవీణ్‌కుమార్, మోహన్, సత్య, ప్రకాష్, రామచంద్రయ్య, కోటేశ్వరరావు, మధు, లోకయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే పిల్లలను చేర్పించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ రమేష్‌బాబు

పుత్తూరు: పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు కృషి చేయాలని ఎంపీడీఓ రమేష్‌బాబు కోరారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు తిరుమల రాజు, బాలసుబ్రమణ్యం, సీడీపీఓ ప్రమీల, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు గీతాంజలి, సంధ్య, వాణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వసంతోత్సవాలు


స్వామివారికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న వేదపండితులు

కార్వేటినగరం: రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో శని వారం వసంతోత్సవాలను టీటీడీ ఆధ్వర్యంలో వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాల, పంచాగ్రవణం తదితర నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 గంటల నడుమ ఉత్సవ మూర్తులకు వేద పండితులు వేద మంత్రాల నడుమ స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ సమర్పణ చేపట్టారు. అనంతరం అలంకార మండపానికి స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి పట్టువస్త్ర, సుగంధభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై ప్రతిష్టించి గ్రామ వీధుల్లో మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా ఊరేగించారు. రాత్రి 8.45 గంటలకు వేద పండితులు స్వామివారికి ఏకాంత సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారి సురేష్ కుమార్ వేదపండితులు, టీటీడీ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఈ-వ్యర్థాలతో అనేక అనర్థాలు


ఈ-వేస్ట్ అవగాహన కరపత్రాలను పంపిణీ చేస్తున్న అధికారులు

గంగాధరనెల్లూరు: ఈ వ్యర్థాల వల్ల జరిగే అనర్థాలను ప్రజలకు వివరించాలని ఎంపీడీఓ హరి ప్రసాద్ రెడ్డి అన్నారు. మండలంలోని ముక్కళత్తూరు గ్రామంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కర పత్రాలను ప్రజలకు అందజేసి, ఈ–వేస్ట్ ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ప్రజల నుంచి సేకరించి, ఈ–వ్యర్థాల వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత లేదా పనికిరాని ఎలక్ట్రానిక్ పరికరాలు పాడైపోయిన తర్వాత సరైన పద్ధతిలో పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని, లేదంటే అవి పర్యావరణానికి, మన ఆరోగ్యానికి తీవ్రమైన హాని కలిగిస్తాయన్నారు. అనంతరం ఆత్మకూరులోని ఓవర్ హెడ్ ట్యాంకులో దిగి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ శ్యామల తదితరులు

విజయపురం: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మణిగండన్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి- వారి బంగారు భవితకు బాటలు వేయండి అనే పోస్టర్‌ను శనివారం ఎంఈఓ శ్యామల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఒత్తిడి లేని నాణ్యమైన విద్య, నైతిక విలువలు, సమాజంపై బాధ్యతలు పెంచే బోధన ఉంటుందన్నారు. అలాగే పోషక పదార్థాలతో కూడిన ఆహారం, విద్యార్థి సమగ్ర అభివృద్ధిపై వ్యక్తిగత శ్రద్ధ, శారీరక మానసిక వికాసం కోసం వ్యాయామ విద్యను అందిస్తున్నామని తెలిపారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మణిగండన్ మాట్లాడుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు అందరిదీ అని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలోనే నాణ్యమైన విద్య

గంగాధర నెల్లూరు: రానున్న విద్యాసంవత్సరంలో ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులను చేర్పించాలని.. తద్వారా ఒత్తిడి లేని విద్యను పిల్లలకు అందేలా కృషి చేయాలని గంగాధర నెల్లూరు ఎంఈఓలు ఆంజనేయులు శెట్టి, గుణశేఖర్ రెడ్డి తెలియజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్షుడు రాజేంద్ర మాట్లాడుతూ ఒత్తిడి లేని, నాణ్యమైన విద్యను అందించేది ప్రభుత్వ స్కూళ్లలో మాత్రమే అన్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో విద్యార్థులు ప్రభుత్వస్కూళ్లలో చేరాలని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

ముమ్మరంగా స్వచ్ఛత కార్యక్రమాలు

విజయపురం: మండల కేంద్రంలో శనివారం డాక్టర్ విష్ణుప్రియ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ నుంచి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. డాక్టర్ మాట్లాడుతూ మండలంలో ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టి వాటి స్థానంలో పేపర్ బ్యాగులు వాడేలా చూడాలన్నారు. ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టాలన్నారు. శ్రీహరిపురం ఉన్నత పాఠశాలలో ఆవరణలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రసాద్ జ్ఞానప్రసాద్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతులతో డీకంపోజ్ చేయాలని పేర్కొన్నారు. ఇంటిలోని ఎలక్ట్రానిక్ వ్యర్థాలను పంచాయతీ గ్రీన్ అంబాసిడర్‌కు అప్పగించాలన్నారు.

వడమాలపేటలో...

వడమాలపేట మండలం ఎస్‌వీపురం పంచాయతీలో శనివారం పంచాయతీ కార్యదర్శి కరుణాకర్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ కవర్లు వాడకుండా, పేపర్ బ్యాగులు వాడాలని, ఇంటిలో వాడే వ్యర్థాలను పంచాయతీ గ్రీన్ అంబాసిడర్లకు అప్పగించాలని కోరారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటు అందరి ఆరోగ్యం బాగుంటుందని ఎంపీడీఓ విద్యావతి, మండల విస్తరణాధికారి రమేష్ తెలిపారు. శనివారం పాలసముద్రం ఉన్నత పాఠశాల, ప్రభుత్వ కార్యాలయ ఆవరణంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్‌లో భాగంగా పరిసరాల శుభ్రం కార్యక్రమాని చేపట్టారు. భవనం ప్రక్కన పెరిగిన చిన్న మొక్కలు, చెత్తచెదారాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఏఓ డిల్లీప్రసాద్, ఐకేపీ ఏపీఎం కల్పలతరెడ్డి, ఏపీఓ మార్గేట్, సచివాలయ సిబ్బంది, అనంతరం డ్వాక్రా సంఘాల సభ్యులతో ప్రతిజ్ఞ చేశారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి అన్నారు. స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం చవటగుంటలో ర్యాలీ ప్రదర్శన చేశారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఎంపీడీఓ మోహన్‌మురళి అన్నారు. జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.



విజయపురం పీహెచ్‌సీలో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర, ర్యాలీ చేస్తున్న అధికారులు, సిబ్బంది



ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులతో కలసి ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు